క్లుప్తంగా

వేగంగా రోడ్డు పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో యూజీడీ, వాటర్ పైపులైన్ పనులు పూర్తయ్యాయి. రోడ్లపై గోతులు పడటంతో స్థానికులు దీనిపై కార్పొరేటర్ బి.జానారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి రోడ్లు వేయాలని ఆదేశించారు. దీంతో వీఎంసీ అధికారులు దావు బుచ్చయ్యకాలనీలోని రోడ్లను జేసీబీతో సెక్షన్ చేసి రోడ్డు పనులు చేస్తున్నారు. వానలు పడుతుండటంతో త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే.. బక్రీద్ శుభాకాంక్షలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పవిత్ర బక్రీద్ పండుగతో ప్రేమ, భక్తి, త్యాగ గుణాలు అందరి ఇళ్లల్లోనూ ఉండాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా నగరంలోని ముస్లింలకు బుధవారం ఆయన ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.
నియోజకవర్గంలోని ముస్లింలకు ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఓ ప్రకటనలో బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. తమకు ఉన్న దాంట్లో ఇతరులకు పంచిపెట్టడం కంటే మించిన దాతృత్వం లేదనే స్ఫూర్తిని బక్రీద్ కలిగిస్తుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గుణదల ఎస్ఐ సత్యశ్రీనివాస్ సూచించారు. బీఆర్టీఎస్ రోడ్డులో బుధవారం గుణదల పోలీసులు వాహనాల రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాహనాల రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనల మేరకు రాకపోకలు సాగించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సక్రమంగా లేని వాహనాలపై కేసులు రాశారు. కార్యక్రమంలో గుణదల పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీలలితాంబికా పీఠంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రోత్సవాలు బుధవారం ముగిశాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ, పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య పర్యవేక్షణలో పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ఉభయదాతలకు వేద ఆశీర్వచనం, ప్రసాదాల వితరణ జరిగింది. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తరించారని పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పేర్కొన్నారు.

ఉచిత సేవలకు కమిషనర్ ఆమోదం?

ఉచిత చెప్పుల స్టాండ్, 2 ఉచిత బస్సులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భక్తుల కోసం ఉచితంగా చెప్పుల స్టాండ్, ఉచిత బస్సు సేవలకు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. దుర్గగుడి పాలక మండలి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత భక్తులకు ఉచితంగా చెప్పుల స్టాండ్ సదుపాయంతో పాటు దుర్గాఘాట్ నుంచి అమ్మవారి సన్నిధికి రెండు దేవస్థాన బస్సులను నడపాలని చైర్మన్ కర్నాటి రాంబాబు ప్రతిపాదనలు చేశారు. వీటిని దేవదాయ శాఖ కమిషనర్ ఈ నెల 14వ తేదీన ఆమోదం తెలిపినట్లు సమాచారం. గురువారం దుర్గగుడి పాలక మండలి సమావేశం జరగనున్న నేపథ్యంలో ఈ అంశం చర్చకు వచ్చే అవకాశాలున్నాయని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామవరప్పాడు: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు అన్నామణి మల్లోలు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో బుధవారం రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం , అక్రమ రవాణా అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నామణి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడి యువత, విద్యార్థులు తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు.

పేదల జీవన ప్రమాణాలు మెరుగు

- సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాంగం
- 24వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



శిఖామణి సెంటర్ సమీపంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ అనిత తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో నిష్పక్ష పాలనతో సుస్థిర అభివృద్ధి సాధ్యమైందని, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 24వ డివిజన్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ అనితతో కలిసి శిఖామణి సెంటర్, ఆర్సీఎం చర్చి రోడ్డులో విస్తృతంగా పర్యటించి అన్ని వర్గాల ప్రజల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వారికి వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు ప్రభుత్వ యంత్రాగం వస్తుండటంతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. నియోజకవర్గంలో 96 వార్డు సచివాలయాలు ఉండగా, ఇప్పటి వరకూ 70 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసినట్లు వెల్లడించారు.

అమ్మఒడికి రూ.36.90 కోట్లు

నియోజకవర్గంలో అమ్మఒడి నాలుగో విడతలో భాగంగా 24,604 మంది విద్యార్థులకు రూ. 36.90 కోట్లు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. పేదలకు చదువు భారం కాకూడదనే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పేదరికంలో ఉన్న తల్లులు అమ్మఒడి పథకం ద్వారా తమ పిల్లలను బడికి పంపించాలనే ఆలోచన చేశారన్నారు.

రాజకీయ అజ్ఞాని పవన్‌కల్యాణ్

పవన్‌కల్యాణ్‌లాంటి రాజకీయ అజ్ఞాని దేశంలోనే మరొకరు లేరని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. ఆయనవన్నీ ప్రగల్భాలు, అసందర్భ ప్రేలాపనలని దుయ్యబట్టారు. పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చిన చంద్రబాబుతో కలిసి అధికారం పంచుకున్న పవన్, ఉమ్మడి ఆస్తుల విభజనపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అసలు రాష్ట్ర విభజనకు ముఖ్య కారకుడైన చంద్రబాబుతో 2014లో ఎందుకు జతకట్టారో పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలన్నారు. వారాహి యాత్రను పిచ్చివాడి పర్యటనగా ప్రజలు భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఊగిపోతూ ఆయన చూపిస్తున్న హావభావాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. నాలుగు రోజులు పర్యటించి రెండు రోజులు నిద్రపోయే పవన్‌కల్యాణ్‌కు, ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ పాదయాత్ర చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుక్కల అనితతో పాటు, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు కుక్కల రమేష్, కొమ్ము చంటి, మోజెస్, చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు

కలిమిశ్రీకి కుసుమ ధర్మన్న సాహితీసేవా పురస్కారం



కలిమిశ్రీ

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన సాహితీవేత్త కలిమిశ్రీని కుసుమ ధర్మన్న సాహితీ సేవా పురస్కారానికి ఎంపిక చేసినట్లు కుసుమ ధర్మన్న సాహితీపీఠం వ్యవస్థాపకురాలు డాక్టర్ రాధాకుసుమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి సామాజిక ఉద్యమకారుడు కుసుమ ధర్మన్న పేరుతో సాహితీ పీఠం ఏర్పాటు చేశామని వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆశయంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023 సంవత్సరానికి పత్రికా సంపాదకుడు, కార్టూనిస్ట్ కలిమిశ్రీని పురస్కారానికి ఎంపిక చేశామని వివరించారు. జూలై 16న విజయవాడలో జరిగే కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. కలిమిశ్రీ వివిధ పత్రికల్లో చేశారని, నవ్యాంధ్ర రచయితల సంఘం ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పురస్కారానికి ఎంపికైన కలిమిశ్రీని నగరానికి చెందిన పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న అరవింద్ కుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంఖ్యాక శాస్త్రంలో విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ వి.అరవింద్ కుమార్ సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం గణిత, సంఖ్యాక, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యాన జాతీయ సంఖ్యాక దినోత్సవ కార్యక్రమం జరిగింది. డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ వి.అరవింద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మండల పరిధి నుంచి జాతీయ పరిధి వరకు జరిగే సంఖ్యాక శాస్త్రం, ఆర్థిక శాస్త్ర అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ, డాక్టర్ జె.నాగేశ్వరరావు, కె.అశోక్, ఎం.లక్ష్మణదాసు, ఎస్.జాన్ సుకుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో అంతరాలు తొలగించండి

దళిత గిరిజన బడ్జెట్ వాచ్



మాట్లాడుతున్న మాదిగాని గురునాథం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ, ఎస్టీలు ఇతర కులాల మధ్య అంతరాలను తొలగించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ ప్రతినిధులు కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం దళిత గిరిజన బడ్జెట్ వాచ్ ఎన్టీఆర్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలుపై చర్చించారు. రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ రమణమూర్తి, సోషల్ డెమొక్రటిక్ అధ్యక్షుడు మాదగాని గురునాథం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టానికి కాల పరిమితిని ఎత్తివేయాలన్నారు. సమాజంలో అంతరాలు తొలగిపోయే వరకు చట్టాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ జామి రమాదేవి, ప్రకాష్, బాబు, మోజెస్, ఎస్టీ నాయకులు రంగారావు, మల్లీశ్వరి, బెంజిమెన్, ఏకుల రవి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నవగ్రహకృతుల గానం



డాక్టర్ నటరాజమూర్తిని సత్కరిస్తున్న కళాశాల పాలక వర్గం

విజయవాడ కల్చరల్: పర్వతనేని బ్రహ్మయ్య సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం, కళాశాల సాంస్కృతిక కళల విభాగం ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ శిష్ఠా నటరాజ మూర్తి బుధవారం కళాశాలోనిని కళావేదికపై నవగ్రహకృతులు 2.0 పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఆహూతులను అలరించింది. నవగ్రహాలు వాటి గమనం వాటి శాస్త్రీయ విశిష్టత, స్వరూప స్వభావాలను వివరిస్తూ రెండు గంటలపాటు గానం చేశారు. వయోలిన్‌తో బీవీ దుర్గాభవాని, మృదంగంతో అమ్ముల ప్రసాద్ సహకరించారు. కార్యక్రమంలో వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, విశ్రాంత శాస్త్రవేత్త పీఎస్ఎన్ మూర్తి, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, సాంస్కృతిక విభాగం సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్, ఉపవిభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసకృష్ణ పాల్గొన్నారు. కచేరి చేసిన నటరాజ రామకృష్ణతో పాటు అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

కానూరులో ట్రక్ ఆటో చోరీ

పెనమలూరు: మండలంలోని కానూరులో ట్రక్ ఆటో చోరీకి గురైంది. ఈ ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసుల కథనం మేరకు.. కందుల ఏసుబాబు కానూరు మురళీనగర్‌లో నివసిస్తూ చేపల వ్యాపారం చేస్తున్నాడు. అతనికి ట్రక్ ఆటో ఉంది. ఏసుబాబు ఈ నెల 26వ తేదీన ట్రక్ ఆటోలో చేపలు తీసుకొచ్చి దిగుమతి చేశాడు. అనంతరం ఆటోను ఇంటి ముందు ఉంచాడు. మంగళవారం ఉదయం నిద్రలేచి చూసుకునే సరికి ట్రక్ ఆటో కనిపించలేదు. ఆటోను చోరీ చేశారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తింటివారిపై కేసు నమోదు

పెనమలూరు: కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన షేక్ ఆశాబేగం గత ఏడాది అదే ప్రాంతానికి చెందిన షేక్ రఫీని పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో రఫీకి అత్తింటివారు కట్నకానుకలు ఇచ్చారు. అతను మెకానిక్‌గా పనిస్తారు. ఇచ్చిన కట్నం చాలేదని, అదనపు కట్నం కావాలని భర్త రఫీ, అత్త నన్నే వేధింపులకు గురి చేయటంతో ఆశాబేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు ఆరోగ్య అవగాహన సదస్సు

గన్నవరం: స్థానిక విమానాశ్రయం పక్కనే ఉన్న ఏబీ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ఉదయం 9 గంటలకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆయుర్వేద వైద్యుడు రవివర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యక్తి ఆరోగ్యమే సమాజ ఆరోగ్యంగా భావించి సదస్సుల ద్వారా ప్రజలను జాగృతి పరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నట్లు తెలిపారు.

ఆరోగ్య కేంద్రం సేవలు వినియోగించుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్య కేంద్రం సేవలు వినియోగించుకోవాలని మధురానగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ అంజు సూచించారు. మధురానగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్యకేంద్రంలో అందిస్తున్న సేవలను వివరించారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడానికి కృషి చేస్తున్నామని, ఖరీదైన రక్త పరీక్షలను కూడా ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బక్రీదుకు ఏర్పాట్లు పూర్తి

మధురానగర్(విజయవాడసెంట్రల్): బక్రీద్ వేడుకలకు మసీదులు ముస్తాబయ్యాయి. ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మధురానగర్‌లోని మస్జిద్ ఏ సిద్దికీ, రామకృష్ణాపురం, మారుతీనగర్, రోళ్ళపాలెం తదితర ప్రాంతాలలో గురువారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి.

10 నుంచి బ్యూటిషియన్ కోర్సులో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళల్లో స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి గవర్నర్ పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జూలై 10వ తేదీ నుంచి బ్యూటిషియన్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం బాధ్యులు పి.విజయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. త్రెడ్డింగ్, వాక్సింగ్, హెయిర్‌కట్, పెడిక్యూర్, మానిక్యూర్, ఫేషియల్స్ అంశాల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు జూలై 8వ తేదీ లోపు పేర్లను రాఘవయ్య పార్కు సమీపంలోని తమ కార్యాలయంలో గానీ, 0866 2578044, 9490098021 నంబర్లలోగానీ సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పటమట(విజయవాడ(తూర్పు): విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ కె. ప్రియాంక అన్నారు. పటమట లంకలోని కేఎస్ఆర్ జడ్పీ హైస్కూల్లో బుధవారంయూనియస్ బ్యాంక్ ఆధ్వర్యాన విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. కె. ప్రియాంక విద్యార్థులకు ఆర్థిక సూత్రాలను వివరించారు. పోటీల్లో వెల్లంకి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం సాధించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈవో సీవీ రేణుక బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు.

నేడు నారాయణతీర్థుల 348వ జయంతి ఉత్సవం

విజయవాడ కల్చరల్: సామగాన లహరి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యాన లబ్బీపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంగీత విద్వాంసుడు నారాయణతీర్థుల 348 జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ మల్లాది సూరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు నారాయణతీర్థుల తరంగ గోష్ఠిగానం ఉంటుందని 12 గంటలు జరిగే తరంగ కార్యక్రమంలో సంగీత విద్వాంసులు, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

వడ్డీ లేకుండా సబ్సిడీతో పన్ను చెల్లించండి

పటమట(విజయవాడ(తూర్పు): నగరపాలక సంస్థకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వడ్డీ లేకుండా రెండు శాతం సబ్సిడీతో చెల్లించడానికి ఈ నెల 30 వరకు మాత్రమే అవకాశం ఉందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సకాలంలో చెల్లించాలని కోరారు. పన్ను చెల్లింపుదారుల కోసం వీఎంసీ సర్కిల్స్ పరిధిలోని అన్ని క్యాష్ కౌంటర్లు సెలవు రోజుల్లో కూడా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం



పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దేశానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతి పురస్కరించుకుని సత్యనారాయణపురం శివాజీ కేఫ్ సెంటర్ వద్ద ఆ మహనీయుని చిత్రపటం వద్ద కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ సమగ్రాభివృద్ధికి పీవీ అందించిన సేవలను స్మరించుకున్నారు. దేశంలో బలమైన ఆర్థిక వ్యవస్థకు పీవీ పునాదులు వేశారని ఈ సందర్భంగా మల్లాది విష్ణు కొనియాడారు. ఆయన బహుభాషా కోవిదుడని, అసాధారణ ప్రతిభ, జ్ఞానం పీవీ సొంతమని కీర్తించారు. దేశ చరిత్రలో నిరంతర సంస్కరణ శీలిగా పీవీ నరసింహారావు చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఆ మహనీయుని ఆశయాలను ముందుకు తీసుకెళ్లే దిశలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. భావితరాలు పీవీ సేవలను స్మరించుకునే విధంగా సత్యనారాయణపురంలో ఆయన కాంస్య విగ్రహ ఏర్పాటుకు సంకల్పించినట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. అనంతరం మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మాజీ మేయర్ జంధ్యాల శంకర్, వైఎస్సార్ సీపీ 33వ డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు దమ్మాలపాటి చంద్రశేఖర్, శనగవరపు శ్రీనివాస్, చల్లా సుధాకర్, లంకా బాబు, మైలవరపు రామకృష్ణ, ఉప్పు రంగబాబు, చాంద్ శర్మ, కూనపులి ఫణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఢిల్లీరావును కలిసిన ట్రైనీ కలెక్టర్లు



కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసిన ఐఏఎస్ ప్రొబేషనరీస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ క్యాడర్ అసిస్టెంట్ కలెక్టర్స్ అండర్ ట్రైనింగ్ 2022 బ్యాచ్ బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఎస్ ఢిల్లీరావును కలిశారు. ఢిల్లీరావును కలిసిన వారిలో ఆయా జిల్లాలకు కేటాయించిన బి.స్మరణ్ రాజ్ (అనకాపల్లి జిల్లా), బి. సహదిత్ వెంకట్ త్రివి నాగ్ (విజయనగరం), సి. యశ్వంత్ కుమార్ రెడ్డి (తూర్పుగోదావరి), కల్పశ్రీ కే.ఆర్ (పల్నాడు), మంత్రి మౌర్య భరద్వాజ్ (వైఎస్సార్ జిల్లా), రాఘవేంద్ర మీనా (శ్రీకాకుళం), సౌర్య మన్ పటేల్ (ప్రకాశం), తిరుమణి శ్రీ పూజ (ఏలూరు), వి. సంజనా సింహా (నెల్లూరు) ట్రైనీ కలెక్టర్లు ఉన్నారు.

పాండురంగడి కల్యాణోత్సవాలు ప్రారంభం



స్వామివారికి పూజలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (కొత్తగుళ్ళు) ప్రాంగణంలోని శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. ఉదయం రుక్మాబాయి సమేత పాండురంగస్వామి మూలమూర్తులకు పంచామృత తిరుమంజనం జరిగింది. వివిధ ఫలపుష్ప సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఆలయంలోని సంతాన వేణుగోపాలస్వామికి కూడా తిరుమంజనం చేశారు. అనంతరం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి నూతన వస్త్రాలను సమర్పించారు. స్వామి వారిని పెళ్లి కుమారునిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఊయలసేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భజనభక్త బృందం ఆధ్వర్యంలో సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు ఉభయదాతలు తదితరులు పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు పులిపాక రాఘవాచార్యులు, మురళీకృష్ణ తదితరులు చేశారు.

దుర్గాఘాట్‌లో ఒలింపిక్ క్రూయిజ్ వేడుకలు



మాట్లాడుతున్న డాక్టర్ తరుణ్ కాకాని

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం పురస్కరించుకుని అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ) సీఈఓ, ఎన్టీఆర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని బుధవారం స్థానిక దుర్గాఘాట్‌లో ఒలింపిక్ క్రూయిజ్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) విజయవాడతో తమ సహకారాన్ని అధికారికంగా ప్రకటించారన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న జాతీయ క్రీడల చాంపియన్ షిప్, ఆ తరువాత ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా రగ్బీలో జాతీయ పతక విజేత హారిక, రెజ్లింగ్ క్రీడలో కిరణ్మయి, ఐఏఎం అధ్యక్షులు డాక్టర్ రెహమాన్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రవీంద్ర, విజయవాడ కార్యదర్శి డాక్టర్ దుర్గారాణి, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ మూర్తిలను డాక్టర్ తరుణ్ కాకాని సత్కరించి అభినందించారు. వేడుకల్లో భాగంగా కృష్ణానదిపై ఏబీసీ బోట్ నుంచి ఒలింపిక్ బెలూన్లను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కె.సుగుణరావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్, కోశాధికారి జె.సింహాచలం పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు ఇండియన్ బ్యాంక్ రుణాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వయం సహాయక సంఘాల సభ్యులకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్‌కుమార్ బజాజ్ తెలిపారు. బుధవారం గాంధీనగర్ ఎన్ఆర్పీ రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం వద్ద స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ పంపిణీ కార్యక్రమం జరిగింది. 3844 గ్రూపులకు రూ.506.60 కోట్ల రుణ మంజూరు చేశారు. రిటైల్, అగ్రి, ఎం.ఎస్.ఎం.ఈ 1192 రుణాలు రూ.354.79 కోట్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేశరామన్ , రూరల్ బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ జనరల్ మేనేజర్ సుబ్రమణియన్, జోనల్ మేనేజర్ వి.వి.ఆర్.కే.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మోనోపోల్ విద్యుత్ టవర్ల నిర్మాణం

నున్న(విజయవాడరూరల్): నున్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి గుణదలకు సరఫరా చేసే విద్యుత్ మోనోపోల్ విద్యుత్ టవర్ల నిర్మాణం పనులు నున్న–గుణదల రోడ్డులో జరుగుతున్నాయి. నున్న 220 సబ్‌స్టేషన్ నుంచి గుణదల సబ్‌స్టేషన్ వరకు మోనోపోల్స్ విద్యుత్ టవర్స్ లైన్లు నిర్మిస్తున్నారు. అక్కడ నుంచి విజయవాడ, పరిసర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు మోనోపోల్ టవర్స్‌ను నిర్మిస్తున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. గతంలో నిర్మించిన టవర్ల విద్యుత్ లైన్లు కిందికి దిగిపో వడం, అనుకోని విధంగా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నందున వాటి స్థానంలో మోనోపోల్ విద్యుత్ టవర్లను నిర్మిస్తున్నారు. ఈ పనులు జరుగుతున్నందున నున్న–గుణదల రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలు రాకుండా చూస్తున్నారు.